క్లుప్తంగా

ఘనంగా అమ్మవారి సంబరం



అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం: పట్టణంలోని రజక సంఘం ఆధ్వర్యంలో బాలాకుమారి అమ్మవారి సంబరాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వివిధ వీధుల్లో నివాసముంటున్న రజక కులస్తుల ఇంటి వద్దకు అమ్మవారిని కాళీమాత వేషధారణతో ఊరేగింపుగా తీసుకెళ్లారు. సంఘ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

మొక్కలు నాటివేత



మొక్కలు నాటుతున్న క్లబ్ సభ్యులు

ఇచ్ఛాపురం టౌన్: మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడుదామని అలయన్స్ క్లబ్ ప్రతినిధులు అన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక రామలింగేశ్వరాలయం ప్రాంగణంలో ఆయుర్వేద, పూల మొక్కలను ఆదివారం నాటారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు లోపింటి నరసింహమూర్తి, బత్తుల వెంకటరమణ, పోలీస్ హెడ్‌కానిస్టేబుల్ తెలుకుల రామారావు, విశ్వహిందూ పరిషత్‌సభ్యులు పాక దాసు పాల్గొన్నారు.

11న ఇస్కాన్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఇస్కాన్, వీహెచ్‌పీ ప్రతినిధులు

ఇచ్ఛాపురం: ఇస్కాన్ ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీ సాయంత్రం సురంగి రాజా క్రీడా మైదానం ఆవరణలో ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను బెల్లుపడలోని యజ్ఞ మండపం వద్ద స్థానిక విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం ఆవిష్కరించారు. అంతర్జాతీయ ప్రవచకులు ధీరసంతగోస్వామి మహారాజ్, యూరప్‌కి చెందిన 30 మంది ఇస్కాన్ భక్తబృందం పాల్గొంటుందని తెలిపారు. ఇస్కాన్ భక్తులు, స్థానిక వీహెచ్‌పీ ప్రతినిధులు, శ్రీకృష్ణుని భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన కల్యాణోత్సవాలు



స్వామివారికి నారికేళ జలాలతో పూజలు చేస్తున్న దృశ్యం

కవిటి: లోళ్లపుట్టుగలో కొద్దిరోజులుగా జరుగుతున్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి 44వ తిరుక్కల్యాణ మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. చివరిరోజున సుప్రభాతసేవ, అర్చన, ధ్వజావరోహణం, పూర్ణాహుతి, మహదాశీర్వాదం కార్యక్రమాలు సంప్రదాయబద్ధంగా జరిగాయి. మధ్యాహ్నం సుమారు మూడు వేల మందికి అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా వేంకటేశ్వర మ్యూజిక్ కళాశాల లెక్చరర్ లోళ్ల జయరాంచే నిర్వహించిన కర్నాటక సంగీత గాత్రకచేరీ ప్రేక్షకులను అలరించింది. వయోలిన్‌తో ఎం.నీలాద్రిరావు, మృదంగంపై బెనారస్ హిందూ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బీఎస్‌వీ ప్రసాదరావు వాయిద్య సహకారాన్ని అందించారు.

'రైతులను దోచుకుంటున్నారు'



దుర్యోధనరావు

కాశీబుగ్గ: మిల్లర్లు దళారులను రంగంలోకి దింపి ధాన్యం కొనుగోలు చేస్తూ రైతులను దోచుకుంటున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధన ఆరోపించారు. పలాసలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన వరిధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు ప్రకటించినప్పటికీ క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి లేదన్నారు. చాలామంది రైతుల వద్ద ధ్యాన్యం నిల్వలు ఉన్నాయని..వాటిని ఎవరు కొనుగోలు చేస్తారా అని ఎదురు చూస్తున్నారన్నారు. పూర్తిస్థాయిలో ధాన్యాన్ని కొనుగోలు చేయకుండానే లక్ష్యం పూర్తయిందని చెప్పి.. కొనుగోలు కేంద్రాలను నిలిపివేయడం అన్యాయమన్నారు.

రౌతుపురం స్టేషన్..
వసతులకు దూరం!

- కనీస సదుపాయాలకు నోచుకోని వైనం
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు



శిథిలావస్థకు చేరిన విశ్రాంతి భవనం

నందిగాం: రాష్ట్రంలోనే విస్తీర్ణంలో పెద్దదైన నందిగాం మండలంలో ఉన్న ఏకైక రైల్వే హాల్ట్ రౌతుపురంలో ఉంది. అయితే ఇక్కడ ప్రయాణికులకు అవసరమైన విశ్రాంతి భవనం, తాగునీరు, మరుగుదొడ్లు, షెడ్‌లు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ స్టేషన్ నుంచి గతంలో రోజుకు సుమారు 500 మంది ప్రయాణికులు రాకపోకలు సాగించేవారు. నందిగాం, వజ్రపుకొత్తూరు మండలాలకు చెందిన సుమారు 30 గ్రామాల ప్రజలు పూండి, పలాస, నౌపడ, పాతపట్నం, పర్లాకిమిడి, గుణుపూర్, శ్రీకాకుళం, విశాఖపట్నం, బరంపురం, పూరీ తదితర ప్రాంతాలకు ఇక్కడ నుంచి రాకపోకలు సాగించేవారు. అయితే ఈ స్టేషన్‌లో గతంలో ఆగిన రైళ్లకు ప్రస్తుతం హాల్ట్ లేకపోవడంతో ఆయా ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల రౌతుపురం, దండుగోపాలపురం రైల్ హాల్ట్‌లకు సంబంధించి రూ.6 కోట్లు అంచనా వ్యయంతో ప్లాట్‌ఫాం ఎత్తు పెంచటం, విశ్రాంతి భవనం మరమ్మతులు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, రక్షణ గోడ



కొత్తగా నిర్మిస్తున్న ఫుట్ ఓవర్‌బ్రిడ్జి

పనులు చేపడుతున్నారు. అయినప్పటికీ రౌతుపురం స్టేషన్‌లో సరైన మంచినీటి సదుపాయం, మరుగుదొడ్లు వసతుల్లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రధానంగా అత్యవసర సమయంలో మహిళా ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మంచినీటి కోసం తుప్పుపట్టి ఉన్న చేతి బోరు నీరే ఆధారంగా ఉంది. వీటితో పాటుగా ఇక్కడ టికెట్ ఇచ్చే కౌంటర్ లేకపోవడంతో ప్రైవేట్ వ్యక్తులు రూ.100లకు రూ.15 కమీషన్‌తో టికెట్ అమ్మకాలు చేపడుతున్నారు. అలాగే ఈ ప్లాట్‌ఫాంలో విశ్రాంతి భవనం శిథిలమైంది. ప్రస్తుతం కనీసం షెడ్ కూడా లేకపోవడంతో ఎండ, వర్షాలకు ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

పలు రైళ్లు నిలుపుదల చేయాలి

నందిగాం, వజ్రపుకొత్తూరు మండలాలకు చెందిన ప్రయాణికులు దూర ప్రాంతాలకు వెళ్లాలంటే రౌతుపురం రైల్వేస్టేషనే ప్రధాన అధారం. అయితే ప్రస్తుతం ఈ హాల్ట్‌లో గుణుపూర్-కటక్ పాసింజర్, పలాస-విశాఖపట్నం డీఎంయూ, విశాఖపట్నం-పలాస ఈఎంయూ రైల్‌లు మాత్రమే



నీటి కోసం ఈ బోరే ఆధారం

ఆగుతున్నాయి. గతంలో పలాస-విశాఖపట్నం, గుణుపూర్-పూరీ పాసింజర్, ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌కు హాల్ట్ ఉండేది. దీంతో ప్రయాణికులకు ఉపయోగంగా ఉండేవి. అయితే ప్రస్తుతం ఈ రైళ్లకు హాల్టు తీసేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి ఈ హాల్ట్‌లో పలు రైళ్లను నిలుపుదల చేయాలని, అలాగే మౌలిక సదుపాయాలు కల్పించాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.

మండపల్లిలో క్షీణించిన పారిశుద్ధ్యం!



రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త

ఇచ్ఛాపురం రూరల్: మండలంలో అతి పెద్ద పంచాయతీ మండపల్లి. మొన్నటి వరకు నియోజకవర్గంలోనే ఉత్తమ పంచాయతీగా అధికారుల ప్రశంసలు పొందిన ఈ పంచాయతీ ఇప్పుడు కంపుగొడుతోంది. ఎక్కడికక్కడ చెత్త, చెదారం పేరుకుపోయింది. గ్రీన్ అంబాసిడర్‌కు గత కొంత కాలంగా పంచాయతీ అధికారులు వేతనాలు చెల్లించకపోవడంతో ఆయన విధులకు హాజరు కావడం లేదు. దీంతో చెత్తను స్థానికులు ఎక్కడికక్కడ పడేస్తుండడంతో పారిశుద్ధ్యం క్షీణిస్తోంది. అలాగే గ్రామంలోని నాలుగు మంచినీటి బోర్లు మరమ్మతులకు గురికావడంతో స్థానికులు నీటి కోసం అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, పాడైన బోర్లను బాగుచేయించి నీటి కష్టాలు తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.

రైతులకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య

ఇచ్ఛాపురం రూరల్: భూమి గల ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్యను ఇవ్వనున్నట్టు మండల వ్యవసాయాధికారి టి.భార్గవి ఆదివారం తెలిపారు. గుర్తింపు సంఖ్య ద్వారా రైతులకు మేలు చేసే విధంగా వ్యవసాయ సేవలను సులభతరం చేసి పారదర్శకంగా మరింత అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. దీని ద్వారా ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, ఇతర వ్యవసాయ సంబంధిత సేవలను పొందడానికి ఈ సంఖ్య అధికారిక గుర్తింపునిస్తుందని అన్నారు. అదే విధంగా భూ ఆధారిత పథకాలైన పీఎం కిసాన్ చెల్లింపులు, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు పంపిణీ, రాయితీపై సూక్ష్మ పోషకాలు, సూక్ష్మసేద్యంపై రాయితీ, పంట రుణాలు, పెట్టుబడి సాయం తదితర పథకాలు నేరుగా పొందేందుకు అవకాశం ఉందన్నారు. పూర్తి వివరాలకు రైతులు గ్రామంలోని రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు.

పార్టీని మరింత పటిష్టపరచండి



మండల పార్టీ అధ్యక్షులను సత్కరిస్తున్న పేరాడ తిలక్

- వైఎస్సార్‌సీపీ టెక్కలి ఇన్‌చార్జి తిలక్

నందిగాం: పేదల పక్షాన నిలిచిన వైఎస్సార్‌సీపీని మరింత పటిష్టపరిచేలా కృషి చేయాలని పార్టీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ అన్నారు. తిలక్‌ను ఆదివారం తన ఇంటి వద్ద నియోజకవర్గంలోని నాలుగు మండలాల పార్టీ నూతన అధ్యక్షులు హనుమంతు వెంకటేశ్వరరావు, సంపతిరావు హేమసుందరరాజు, తమిరె ఫాల్గుణరావు, బుడ్డ మోహనరెడ్డి మర్యాదగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మనందరిపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ముచేయకుండా నియోజకవర్గంలో పార్టీని బలోపేతంపై దృష్టిసారించాలని కోరారు. అలాగే కూటమి నాయకుల ద్వారా ఇబ్బందులకు గురవుతున్న పార్టీ కార్యకర్తలకు అండగా ఉండాలని, వారిపక్షాన అందరం కలిసి పోరాడుదామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులను తిలక్ దుశ్శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు అన్నెపు రామారావు, కార్యదర్శి పొన్నాన మోహన్, కోటబొమ్మాళి జెడ్పీటీసీ సభ్యుడు దుబ్బ వెంకటరావు, బీసీ సెల్ అధ్యక్షుడు వెంకటరావు, నాయకులు మల్లయ్య, మురళీ, నూక సత్యరాజ్, రామక్రిష్ణ, మెట్ట సింహాచలం, బొడ్డు వెంకటరమణ, పంకు రామమ్, నేతింటి అప్పలస్వామి, శివారెడ్డి, బెలమర మహేష్, తులసీరావు, కామినాయుడు, తర్ర రమణ ఉన్నారు.

బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు

నందిగాం: మండల కేంద్రం నందిగాం బాలికల గురుకుల పాఠశాల సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నందిగాంకు చెందిన కె.దాలయ్య జాతీయ రహదారి దాటుతుండగా టెక్కలి నుంచి పలాస వైపు వెళ్తున్న ద్విచక్రవాహనదారుడు ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. దాలయ్యకు తీవ్రగాయాలు కావడంతో 108 వాహనంలో టెక్కలి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

కంచిలి: మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ సానుభూతిపరులు పలువురు మృతి చెందారు. ఆయా కుటుంబాలను ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. తలతంపరకు చెందిన బెందాళం గంగాధర్ తల్లి సరస్వతి, కుత్తుంకు చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు కీలు సత్యం సోదరి గౌరకల రోహిణమ్మ, పెద్దఅంపురం గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ లింగం కేశవరావు తండ్రి చిరంజీవులు, డి.జి.పురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కాయ దాల్మయ్యరెడ్డి మృతి చెందడంతో ఆయా కుటుంబాలను పరామర్శించి సంతాపం తెలియజేశారు. నాయకులు లడ్డు కేశవపాత్రో, కొణపల సురేష్, ఖెత్రో దొళాయి, కీలు సత్యం ఉన్నారు.

సొండిపూడి దివ్యాంగుడికి సత్కారం



వెంకయ్యనాయుడు చేతులమీదుగా సత్కారం పొందుతున్న భాస్కరరావు

మందస: మందస మండలం సొండిపూడి గ్రామానికి చెందిన దివ్యాంగుడు మల్లారెడ్డి భాస్కరరావుకు అరుదైన అవకాశం దక్కింది. మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు చేతులమీదుగా భాస్కరరావు సన్మానం పొందారు. మదర్ వలంటరీ ఆర్గనైజేషన్‌ను స్థాపించిన భాస్కరరావు దివ్యాంగులకు ఎనలేని సేవలు అందిస్తున్నారు. ఆయన సేవలను గుర్తించి విజయనగరం జిల్లా కొత్తవలస మండలం మంగళపాలెంలోని గురుదేవ చారిటబుల్ ట్రస్టు 27వ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం నిర్వహించిన వేడుకల్లో భాస్కరరావును సత్కరించారు.

నాగరిబోధ్ పరీక్షకు 80 హాజరు



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

కంచిలి: మండల కేంద్రం కంచిలిలో ఆంధ్రప్రదేశ్ హిందీ ప్రచార సభ సమితి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన నాగరిబోధ్ ప్రవేశ పరీక్షకు మంచి స్పందన లభించింది. ఈ పరీక్షను స్థానిక విజ్ఞాన్ పాఠశాల కేంద్రంలో నిర్వహించగా.. 5,6,7 తరగతులకు చెందిన 80 మంది విద్యార్థులు పాల్గొన్నారు. హిందీ ప్రచార సభ కో-ఆర్డినేటర్ నిరంజన్ ఖడంగా ఆధ్వర్యంలో నిర్వహించగా, పాఠశాల కరస్పాండెంట్ ఆదినారాయణ, ప్రిన్సిపాల్ ఉమ, ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

మద్యం షాపుల లాటరీ వాయిదా

ఇచ్ఛాపురం: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కారణంగా సోమవారం నిర్వహించాల్సిన గీత కార్మికులకు ప్రభుత్వం కేటాయించిన మద్యం షాపుల లాటరీ వాయిదా పడిందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మళ్లీ ఎప్పుడు లాటరీ నిర్వహించేది ప్రభుత్వం త్వరలోనే ప్రకటిస్తోందన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం కార్యవర్గం ఎన్నిక



సమావేశంలో విశ్వబ్రాహ్మణ సంఘ ప్రతినిధులు

సోంపేట: ఇచ్ఛాపురం నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ సంఘం విస్తృతస్థాయి సమావేశాన్ని ఆదివారం సోంపేటలో నిర్వహించారు. ఇందులో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా అనుపోజు వెంకటరావు, ఉపాధ్యక్షునిగా తోనంగి శంకరరావు, సభ అధ్యక్షునిగా భైరి కుమారస్వామి, గౌరవ అధ్యక్షునిగా కిమ్మోజు కుమారస్వామి, కార్యదర్శిగా కొర్లాపు ప్రకాశ్‌రావు, కోశాధికారిగా తామాడ నరసింహమూర్తి, కన్వీనర్ కోటిపల్లిగా వెంకటరావు నియమితులయ్యారు.

ధనరాజులమ్మకు పూజలు



తులసమ్మ ఆలయం వద్ద భక్తులు

ఇచ్ఛాపురం రూరల్: లొద్దపుట్టిలోని ధనరాజుల తులసమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆంధ్రా, ఒడిశా ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని మొక్కుబడులు తీర్చుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఉత్సాహంగా భగవద్గీత పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని మదర్‌థెరిసా పాఠశాలలో ఆదివారం భగవద్గీత పోటీలు ఉత్సాహంగా జరిగాయి. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలలో 30 పాఠశాలలకు చెందిన వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు పలాస ప్రఖండ విభాగం ప్రతినిధులు బహుమతులు అందజేశారు.

క్విజ్ పోటీలకు స్పందన



సిక్కోలు గణిత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం టెక్కలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండలస్థాయి గణితం క్విజ్ పోటీలకు విశేష స్పందన లభించింది. 6, 7 తరగతి విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో తలగాం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రథమ, బొరిగిపేట ప్రాథమికోన్నత ద్వితీయ, సీతాపురం జెడ్పీ పాఠశాల విద్యార్థులు తృతీయస్థానంలో నిలిచారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు నరేష్, పాపారావు, మురళీకృష్ణ, శ్రీనివాసరావు, కాంతి, స్వర్ణలత, జ్యోతి, విజయకుమార్, సురేష్ పాల్గొన్నారు.

– టెక్కలి

బతుకు పోరాటం..



కొద్దిరోజులుగా పొగమంచు దట్టంగా కురుస్తోంది. అర్ధరాత్రి నుంచి ఉదయం తొమ్మిది గంటల వరకూ మంచు పడుతుండడంతో అన్నివర్గాలవారూ ఇబ్బందులు పడుతున్నారు. అయితే చాలామంది దీన్ని పట్టించుకోకుండా వారి దైనందిన కార్యకలాపాల్లో నిమగ్నమవుతున్నారు. బతుకుపోరాటతంలో ముందుకు దూసుకుపోతున్నారు. ఆదివారం ఉదయం భారీగా మంచుకురుస్తున్నప్పటికీ పట్టించుకోకుండా బ్రాహ్మణతర్లా-అనంతగిరి గ్రామాల మధ్య ఇటుకల తయారీలో కార్మికులు నిమగ్నమవ్వగా ఆ దృశ్యాన్ని 'సాక్షి'కెమెరా క్లిక్ మనిపించింది.

–కాశీబుగ్గ

గ్రంథాలయం చెంతనే..



మండల కేంద్రమైన వజ్రపుకొత్తూరులోని గ్రంథాలయం, బస్ స్టాండ్ చెంతనే మందుబాబులు మద్యం సేవించి ఖాళీ సీసాలు, ప్లాస్టిక్ గ్లాసులు పడేస్తున్నారు. దీంతో గ్రంథాలయానికి వచ్చే పాఠకులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. మద్యం బాటిళ్లు, ప్లాస్టిక్ గ్లాసులు కుప్పలుగా దర్శనం ఇస్తున్నాయి. బహిరంగ ప్రదేశంలోనే మందుబాబులు మద్యం తాగుతుండడంతో అటుగా వెళ్లే మహిళలు, చిన్నారులు భయాందోళన చెందుతున్నారు. పోలీసులు, ప్రజా ప్రతినిధులు స్పందించి మందుబాబుల ఆగడాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

–వజ్రపుకొత్తూరు రూరల్

నిరుపేద కుటుంబానికి అండగా..



బన్నువాడ గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి టెక్కలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివిన 1995 పదో తరగతి పూర్వపు విద్యార్థి సంఘం అండగా నిలిచింది. గ్రామానికి చెందిన కొత్తపల్లి కృష్ణారావు గత ఏడాది రైలు ప్రమాదంలో మరణించాడు. దీంతో ఆయన భార్య, కుమార్తె, కుమారుడు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని పూర్వ విద్యార్థులు తెలుసుకున్నారు. కుమారుడికి స్కూల్ ఫీజు చెల్లించారు. అలాగే కుమార్తెకు భవిష్యత్ అవసరాల కోసం రూ. 40 వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. వీటితో పాటు రెండు నెలలకు సరిపడా నిత్యవసర సరుకులను అందజేశారు.

– టెక్కలి

మూడు దశాబ్దాల తరువాత ఒకే వేదికపై..



ఒకేవేదికపై పూర్వవిద్యార్థులు

నందిగాం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 33 ఏళ్ల తరువాత ఆదివారం కలిశారు. దీనికి చదువుకున్న పాఠశాల ఆవరణే వేదికైంది. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆటపాటలతో సందడి చేశారు. చదువు చెప్పిన అప్పటి ఉపాధ్యాయులు ఈశ్వరరావు, రామక్రిష్ణ, ఆదినారాయణ, వెంకటేశ్వరరావు, టి.లక్ష్మీనారాయణ, తాతయ్య, సద్గుణరావు తదితరులకు పాదపూజలు చేసి.. దుశ్శాలువలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. పూర్వవిద్యార్థులు శాంతికుమార్, దుర్యోధన, మోహనరావు, భుజంగరావు ఉన్నారు.

మత్తుకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ విజయ్‌కుమార్

టెక్కలి రూరల్: ప్రజలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని టెక్కలి సీఐ ఎ.విజయ్‌కుమార్ అన్నారు. రాధవల్లభపురం గ్రామంలో ఆదివారం రాత్రి సంకల్పం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. దొంగతనాలకు ఆస్కారం లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, సైబర్ నేరాల బారినపడకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

రూ. 55 వేల సాయం



కోమాలో ఉన్న ధనలక్ష్మి

కాశీబుగ్గ: మందస మండలం దున్నూరు పంచాయతీ మొగిలిపాడు గ్రామానికి చెందిన తెప్పల ధనలక్ష్మికి మెదడులో నరాలు చిట్లి కోమాలోకి చేరుకుంది. శ్రీకాకుళంలని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. వైద్యం కోసం పది లక్షల రూపాయలు ఖర్చవుతుందని వైద్యులు చెప్పారు. నిరుపేద కుటుంబం కావడంతో ఏమి చేయలేని స్థితిలో ఉండిపోయారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులంతా చందాలు వేసుకుని 55, 315 రూపాయలు సేకరించారు. ఈ మొత్తాన్ని బాధితురాలికి ఆదివారం రాత్రి అందజేశారు.

విశ్రాంతి భవనం ప్రారంభం

వజ్రపుకొత్తూరు రూరల్: డోకులపాడు గ్రామంలోని శ్మశానవాటికలో గంగాధర సేవా సంఘం ఆధ్వర్యంలో దాతల సహకారంతో నిర్మించిన విశ్రాంతి భవనాన్ని ఆదివారం ప్రారంభించారు. లండ గురయ్య, లక్ష్మీదేవి కుటుంబ సభ్యులు సుమారు రూ. మూడు లక్షల ఆర్థికసాయంతో దీన్ని ఏర్పాటు చేశారు.

మృతుని కుటుంబానికి సాయం



పిల్లలకు సాయం అందజేస్తున్న దృశ్యం

కంచిలి: జాడుపూడి గ్రామానికి చెందిన పిలక షణ్ముఖ కువైట్లో వలస కూలీగా పనిచేస్తూ మృతి చెందాడు. మృతునికి ముగ్గురు చిన్న కుమార్తెలు ఉన్నారు. పిల్లలు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని గ్రామానికి చెందిన పలువురు ఆర్థిక సాయం చేశారు. ఫిక్సిడ్ డిపాజిట్ రూపంలో చేసిన, సంబంధిత పత్రాలను బాధిత చిన్నారులకు ఆదివారం అందించారు. సాయం అందించిన వారిలో స్థానిక కాళీదుర్గా సేవా సంఘం రూ. 90 వేలు, గ్రామానికి చెందిన పిలక ఆనంద్ (ఆదయ్య) స్లోవేనియా దేశంలో పనిచేస్తూ, తనతో పైప్ టెక్ కంపెనీలో పనిచేస్తున్న స్నేహితులు ద్వారా రూ. 26,700 సంఘానికి అందించగా మొత్తంగా 1,16,700 రూపాయలను మృతుడు షణ్ముఖరావు ముగ్గురు కుమార్తెల పేరుమీద ఫిక్స్‌డ్ డిపిజిట్ చేసినట్లు తెలిపారు.